సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



'శివరాత్రి'కి సిద్ధం
ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. ఇప్పటికే అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.
- 8లో▸



చండికా అమ్మవారి ప్రతిష్ఠ
శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చండికా అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$34.0^0/19.0^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రీ స్కూల్ హాజరుశాతం పెంచాలి
హన్మకొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ హాజరుశాతాన్ని పెంచాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సబిత ఆదేశించారు. గురువారం వడ్డెపల్లి సెక్టార్‌లోని వడ్డెపల్లి ముదిరాజ్‌వాడ, నాన్యతండా, ఫాతిమానగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. కోడిగుడ్లు ఎలా ఉన్నాయో పరిశీలించారు. పౌష్టికాహారం, బాలమృతం, స్టాక్ వివరాలు, పంపిణీ తీరును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. యూనిఫాం ధరించకపోవడం, పిల్లలను త్వరగా పంపించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

ఉపాధి, పునరావాసానికి దరఖాస్తుల ఆహ్వానం
కాళోజీ సెంటర్: దివ్యాంగులకు ఉపాధి, పునరావాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కోసం జిల్లాకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి(20) యూనిట్లకు రూ.1,50,000 మంజూరు చేశారని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28 వరకు దరఖాస్తులను సంబంధిత సైట్‌లో ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన
విద్యారణ్యపురి: మల్టీజోన్ 1 పరిధిలో గ్రేడ్-2 హెడ్మాస్టర్లుగా పదోన్నతికి అర్హులైన హనుమకొండ జిల్లాలోని హిందీ స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్లు, సర్వీస్‌బుక్స్‌ను గురువారం మరోసారి హనుమకొండలోని తన కార్యాలయంలో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పర్యవేక్షణలో పరిశీలన చేయించారు. నారాయణగిరి గెజిటెడ్ హెచ్ఎం బి.రాంధన్, మరో హెచ్ఎం సుధాకర్‌లు సర్టిఫికెట్లను పరిశీలించారు.

హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ ఆధునికీకరణ



హన్మకొండ: ఆర్టీసీ హనుమకొండ బస్‌స్టేషన్‌ను ఆధునికీకరించనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం ఆ బస్‌స్టేషన్‌ను టీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, బల్దియా కమిషనర్ ప్రావీణ్యతో కలిసి పరిశీలించారు. బస్‌స్టేషన్ అవరణ మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం వరంగల్ రీజియన్ కార్యాలయంలోని ఆర్ఎం చాంబర్‌లో సమావేశమై బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ,సుందరీకరణ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులను సజ్జనార్ ఆదేశించారు.

19మంది డీబార్
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్, పీజీ కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ వివిధ కేంద్రాల్లో 19మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు మధుకర్, నరేందర్, జ్యోతి తెలిపారు.

మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు
వరంగల్ క్రైం: భూ తగాదా కేసులో కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి బాధితులకు వ్యతిరేకంగా వ్యవహరించారనే కారణంగా వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు సీపీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రంగనాథ్ సీపీగా బాధ్యతలు చేపట్టాక భూ తగాదా కేసులపై సీరియస్‌గా ఉన్నారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు జైలుకు వెళ్లండగా, పోలీస్ అధికారులు సస్పెండ్ అవుతున్నారు.

మహిళా అభ్యర్థుల ఈవెంట్లు ప్రారంభం




వరంగల్ క్రైం: పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ మైదానంలో మహిళా అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్లు గురువారం ప్రారంభమయ్యాయి. 1,159 మంది అభ్యర్థులకు 859 మంది హాజరుకాగా, 491 మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీ సురేష్, సంజీవ్, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు పరుగులు!

ఎంజీఎం, 'సూపర్'లో అందని స్కానింగ్, ల్యాబ్ సేవలు

- పేరుకే ప్రభుత్వ వైద్యులు.. ప్రైవేట్ క్లినిక్‌లో సేవలు
- నెలల తరబడిగా నిలిచిపోయిన ఎంఆర్ఐ సేవలు
- సూపర్‌ఆస్పత్రిలో అందుబాటులోకి రాని ల్యాబ్
- స్కోలోనో స్కోపీ, ఎండోస్కోపీ పరికరాలు వృథా
- అడ్రస్ లేని అభివృద్ధి కమిటీ సమావేశం
- పరిపాలనాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

వారం రోజుల క్రితం ఓ వ్యక్తి బ్రెయిన్ ట్యూమర్‌తో అడ్మిట్‌గా అతనికి సీటీ పరీక్షలు నిర్వహించారు. అందులో స్పష్టమైన నివేదికలు రాకపోవడంతో ఎంఆర్ఐ తప్పనిసరి తీయాల్సి వచ్చింది. కానీ ఎంజీఎంలో ఎంఆర్ఐ సేవలు నిలిచిపోయాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు పరుగులు పెట్టాల్సి వచ్చింది. చేతిలో సరిపోను డబ్బు లేక ప్రభుత్వాస్పత్రికి వచ్చిన బాధితుడు.. స్కానింగ్ పేరిట రూ.5వేలు కట్టాల్సి వచ్చింది.



ఎంజీఎంలో మరమ్మతుకు నోచుకోని ఎంఆర్ఐ పరికరం

ఎంజీఎం : రాష్ట్ర ప్రభుత్వం పేద రోగులకు మెరుగైన సేవలందించాలని రూ.కోట్ల నిధులు ఖర్చులు చేసి పరికరాలు కొనుగోలు చేసి... వైద్యులు నియమించినా ఎంజీఎం ఆస్పత్రిలో మాత్రం అందుబాటులోకి రావడం లేదు. సమీక్ష సమావేశాల్లో చూపించే లెక్కలు ఓ రకంగా ఉంటే ఆస్పత్రిలో అందే సేవలు మరో రకంగా ఉంటున్నాయి. వెయ్యి పడకల ధర్మాస్పత్రిగా ఉన్న ఎంజీఎంలో మూడు నెలలుగా ఎంఆర్ఐ సేవలు నిలిచిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక.. సూపర్ ఆస్పత్రిలో కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన ల్యాబ్ పరికరాలను ఉపయోగించకుండా.. అసలు ల్యాబ్‌నే ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మరో పక్క ఎండోస్కోపి, కోలోనోస్కోపి వంటి పరీక్షలు నిలిచిపోయి నెలలు గడస్తున్నా వాటి గురించి పట్టించుకునే నాథుడే లేడు. ఏ వైద్యుడు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియని దుస్థితి ఆస్పత్రిలో నెలకొంది. ఆస్పత్రిలో పాలన అస్తవ్యవస్తంగా ఉందనడానికి నిదర్శంగా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే రోగుల సంఖ్యనే బట్టి అర్థమవుతుంది. వెయ్యి పడకల ఉన్న ఆస్పత్రిలో ఒక్కప్పుడు 1100మందికి పైగా రోగులు చికిత్సలు పొందేవారు. కాగా, సూపర్‌ఆస్పత్రి మంజూరుతో అసంఖ్య 1350మందికిపైగా పెరగగా, ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో ఆ సంఖ్య వెయ్యి లోపే ఉండడం గమనార్హం.

చలో ప్రైవేట్ క్లినిక్..
ఎంజీఎం ఆస్పత్రిలోని ప్రముఖ వైద్యులకు ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. వీరంతా ఆస్పత్రి విధులకు డుమ్మా కొట్టి సొంత వ్యవహారాలు చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉదయం 10 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న వైద్యుల్లో మధ్యాహ్నం 12 దాటితే జంప్ అయ్యే వారి సంఖ్య పదుల్లోనే ఉంటోంది. మరికొంత మంది వారానికి రెండు రోజులు వస్తూ వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలకోసారి చుట్టపు చూపుగా పరిపాలనాధికారులను పలకరించి వెళ్తున్న వారూ ఉన్నారు. చిన్న చిన్న ఉద్యోగులపై ప్రతాపం చూపే పరిపాలనాధికారులు .. వైద్యసేవల్లో కీలకంగా వ్యవహరించే వైద్యులపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

3 నెలలుగా నిలిచిన ఎంఆర్ఐ సేవలు..
ఎంజీఎంలో 3నెలలుగా ఎంఆర్ఐ స్కానింగ్ నిలిచిపోయాయి. ఈ పరికరాన్ని మరమ్మతు చేయించడానికి లక్షలాది రూపాయలు కేటాయించాల్సి వస్తుందనే విషయాన్ని సాకుగా చూపిస్తూ మూలకు పడేశారు. ఆస్పత్రికి వచ్చే పేద రోగులు బయట స్కానింగ్ తీయించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. బ్రెయిన్ ట్యూమర్, రోడ్డు ప్రమాదాలు తదితర బాధితులకు ఎంఆర్ఐ అవసరముంటుంది. అలాంటి సందర్భంలో ఎంత త్వరగా చికిత్స అందిస్తే అంత మెరుగ్గా కోలుకోంటారు. ఎంజీఎంలో ఇలాంటి సేవలు లేకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అడ్రస్ లేని అభివృద్ధి కమిటీ సమావేశం
సేవలను మెరుగుపరిచేందుకు కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల సమక్షంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని మూడు నెలలకోమారు నిర్వహించాలి. ఆస్పత్రిలో ఉన్న సమస్యలు వారి దృష్టికి వెళ్లడంతోపాటు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఏళ్ల తరబడి సమావేశం నిర్వహించకపోవడం వల్ల ఆస్పత్రిలో సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు.

సూపర్ ఆస్పత్రిలో కుప్పలుగా పరికరాలు..
200 పడకలతో కొనసాగుతున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రభుత్వం ప్రత్యేక ల్యాబ్ నిర్మించి కోట్లాది రూపాయల విలువ గల పరికరాలు కొనుగోలు చేసి అందించింది. అంతే కాకుండా 16మంది ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమించింది. పరిపాలనాధికారులు మాత్రం ఆ పరికరాలను కుప్పలుగా పోసి ల్యాబ్ సేవలు ప్రారంభించలేదు. రక్త పరీక్షల కోసం నియమించిన టెక్నీషియన్‌లను శాంపిల్ టేకర్స్‌గా ఉపయోగించుకుంటున్న దైన్యం నెలకొంది.





నగరంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి

- ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్
- సీఎం కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు షురూ



క్రికెట్‌చాంపియన్ షిప్ పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, పక్కన వినయ్

కేయూ క్యాంపస్: గ్రేటర్ వరంగల్ నగరంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ హామీఇచ్చారు. సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని గురువారం బీఆర్ఎస్‌వీ, కాకతీయ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలలో ఏర్పాటుచేసిన కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలో స్టేడియం ఏర్పాటు ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య, బైరపాక ప్రశాంత్, ఫారూఖ్, వీరేందర్, బీఆర్ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు కేక్ కట్‌చేశారు. పోటీల్లో పశ్చిమ నియోజకవర్గంలోని 60 క్రికెట్ టీంలు పాల్గొంటున్నాయి. అనంతరం వినోద్‌కుమార్, వినయ్‌భాస్కర్, అజీజ్ ఖాన్‌లు ఆర్ట్స్ కాలేజీని సందర్శించారు. వివిధ విభాగాలు, చేపడుతున్న కార్యక్రమాలను ప్రిన్సిపాల్ అయిలయ్య వారికి వివరించారు.

సాంకేతిక కారణాలు.. ఆగిన ధ్రువపత్రాల జారీ

- వరంగల్ ప్రాంతం సైతం హనుమకొండగానే..
- తప్పుల తడకగా 'ఈ-మున్సిపల్ తెలంగాణ'

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ నగరంలో కొత్తగా ఇల్లు కట్టుకున్న వారు నంబర్ కోసం పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. 'ఈ-మున్సిపల్ తెలంగాణ'వెబ్‌సైట్‌లో సాంకేతిక కారణాలతో నగరంలో ఆస్తి పేరు మార్పిడిలు, ఆస్తుల విభజన, ఓనర్ షిప్, అసెస్‌మెంట్, నో డ్యూస్ పత్రాల కోసం, ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు స్తంభించిపోయాయి. రేపు, మాపు అంటూ 50 రోజులుగా అధికారులు కాలయాపన చేస్తుండటంతో కార్యాలయాల చుట్టూరా తిరగలేక ప్రజలు విసిగివేసారిపోతున్నారు. పత్రాలు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తామని రిజిస్ట్రార్లు పేర్కొంటున్నారు. సుమారు 1,500 వరకు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

అసలు సమస్య ఇదీ..
గ్రేటర్ వరంగల్ నూతనంగా అమలు చేస్తున్న 'ఈ-మున్సిపల్ తెలంగాణ'తప్పుల తడకగా మారింది. నగరం రెండు జిల్లాల (వరంగల్, హనుమకొండ) పరిధిలో ఉండగా మొత్తం లావాదేవీలన్నీ హనుమకొండ జిల్లాలోనే నమోదు చేసుకునేలా సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేశారు. ఇంటినంబర్లు, నల్లా కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్, యూజర్ చార్జీలు, ఇతర కార్యకలాపాలన్నీ 'ఈ-మున్సిపల్ తెలంగాణ'లోని హనుమకొండలోనే నమోదు చేస్తే కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలు ఓపెన్ అవుతున్నాయి. వరంగల్‌ను క్లిక్ చేస్తే వర్ధన్నపేట, నర్సంపేట అని చూపిస్తోంది. నగరంలోని వరంగల్ ప్రాంతమైనప్పటికి హనుమకొండను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై బల్దియా ఐటీ విభాగం సిబ్బందిని వివరణ కోరగా.. వారం రోజుల్లోగా సాంకేతిక సమస్యలు పరిష్కారమవుతాయని చెబుతున్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు పులి బలి?
- 10లో▸

- దుప్పుల కోసం ఉచ్చు పెడితే.. పులి, అడవి పంది మృతి
- భూపాలపల్లి అడవుల్లో గుట్టుచప్పుడు కాకుండా దహనం



కృష్ణా ఎక్స్‌ప్రెస్ 12 గంటలు రీ షెడ్యూల్
నేడు యథావిధిగా రైళ్లు
కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు గోదావరి ఎక్స్‌ప్రెస్ ఘటనతో గురువారం గంటల తరబడి ఆలస్యంగా నడిచినట్లు రైల్వే అధికారులు తెలిపారు. తెలంగాణ ఎక్స్‌ప్రెస్, గంటన్నర, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంట, ఇంటర్‌సిటీ గంట, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ గంట, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ గంట, శాతవాహన ఎక్స్‌ప్రెస్ అర గంట ఆలస్యంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకొని వెళ్లినట్లు చెప్పారు. అదేవిధంగా తిరుపతి-ఆదిలాబాద్ మధ్య ప్రయాణించే కృష్ణా ఎక్స్‌ప్రెస్ 12 గంటలతో రీషెడ్యూల్ ఉందని, అదేవిధంగా పలు రైళ్లను కాజీపేట మీదుగా కాకుండా సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు. కాజీపేట మీదుగా శుక్రవారం యథావిధిగా రైళ్లు నడుస్తాయని ప్రకటించారు.

నీటి సరఫరాపై అధ్యయనం
వరంగల్ అర్బన్: నగరంలో మంచినీటి సరఫరాలో తలెత్తుతున్న లోపాలపై నిపుణుల కమిటీ మూడో రోజు గురువారం అధ్యయనం చేసింది. హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు రిటైర్డ్ ఆపరేషన్ అధికారి రవికుమార్ నేతృత్వంలో బల్దియా, ప్రజారోగ్యం ఇంజనీర్ల బృందం వరంగల్ దేశాయిపేట, కేయూసీ, వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, రిజర్వాయర్లు, లాస్ట్ కనెక్టివిటీ వరకు నీటివృథా తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో లైన్‌మన్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి నష్టాలు, పునరుద్ధరణపై చర్చించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
హన్మకొండ/వరంగల్ రూరల్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నామని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, డబుల్ బెడ్ రూం ఇళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 1,211 ఇళ్లకు 5,300 దరఖాస్తులు వచ్చాయన్నారు. మార్చి 15 వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వరంగల్ నుంచి కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ పాల్గొని జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితిని వివరించారు.

ఆశీస్సులు తీసుకుని.. ఆశీర్వాదం కోరుతూ



వర్ధన్నపేటలో సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- ఐనవోలు, వర్ధన్నపేటలో సాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- ఉదయం మల్లికార్జునస్వామికి పూజలు
- మార్గమధ్యలో కరెంటు, ఇళ్లు, తదితర సమస్యలను వివరించిన ప్రజలు
- మీ ఆశీర్వాదం ఉండాలని కోరుతూ ముందుకు
- ఎమ్మెల్యే రమేష్ ఉద్యోగం ఊడగొట్టండని రేవంత్ పిలుపు



ఐనవోలులో పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

ఐనవోలు/వర్ధన్నపేట: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆశీస్సులు తీసుకుని.. దారి పొడవునా ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో ఉత్సాహంగా సాగింది. అక్కడక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్‌పై విమర్శలు చేస్తూ స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలకేంద్రంలో బస చేసిన రేవంత్‌రెడ్డి ఉదయం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులు తీసుకుని పాదయాత్ర ప్రారంభించారు. నందిసెంటర్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్, బీసీ, ఎస్సీ కాలనీల గుండా పెరుమాండ్లగూడెం, పంథిని గ్రామాల మీదుగా సాగింది. పలుచోట్ల ఆయన పలువురిని పలకరిస్తూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరుతూ ముందుకు సాగారు. దారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండగా అందులోకి వెళ్లి ఏఈ అయిలయ్యకు ఏసీడీ చార్జీలు వసూలు చేయొద్దని, వ్యవసాయానికి రాత్రి వేళల్లో విద్యుత్ ఇవ్వకుండా పగలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తూరు ఎల్లయ్య వ్యవసాయ క్షేత్రం వద్ద ఆగిన రేవంత్ మొక్కజొన్న పంటను మేపుతుండగా ఎందుకని ఆరా తీశారు. చాలీచాలని కరెంటుతో నీరందకపోవడంతో ఎండిపోతున్నట్లు వాపోయాడు. కొందరు రైతులు ధరణి పోర్టల్ సమస్యలు రేవంత్ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామన్నారు. బొల్లెబోయిన రమేష్ మిషన్ సాయంతో మొక్కజొన్న చేను కోస్తుండగా అక్కడకు వెళ్లి మిషన్ డ్రైవింగ్ సీటులో కూర్చుని నడిపాడు. పెరుమాండ్లగూడేనికి రేవంత్ చేరుకోగా ఆయనను మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ల్యాండ్ పూలింగ్ అంశంలో గ్రామానికి చెందిన 12మందిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని రేవంత్‌కు తెలిపారు. పంథినిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కాగా.. పాదయాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి ఐనవోలు అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండానే ముందుకు సాగడంపై స్థానికంగా చర్చ జరిగింది.

అక్కడినుంచి వరంగల్ జిల్లాలోకి ప్రవేశించింది. వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త వంగాల గజేందర్ ఇంటికి వెళ్లి తలుపుపై హాథ్ సే హాథ్ స్టిక్కర్‌ను అతికించారు. పాదయాత్రలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, కోదండరెడ్డి, మహేశ్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, స్వర్ణ, మండల పార్టీ నాయకులు మహేష్, కుమారస్వామి, సంపత్, ఎం చిరంజీవి, భాస్కర్, చిరంజీవిరెడ్డి, రాజు, సునీల్, మహేందర్, బండి సుధాకర్, బోంపెల్లి దేవేందర్‌రావు, జక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేశ్ పదవిని ఊడగొట్టండి
వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఉద్యోగం ప్రజలు ఊడగొడితేనే అందరికి క్షేమం కలుగుతుందని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములను లాక్కుని అరూరి రమేష్ వాటి ధరలు పెంచుకుంటున్నాడని ఆరోపించారు. రమేష్ పోతేనే మీ భూములు మీకు దక్కుతాయని సూచించారు. ప్రజలు గ్రామాల్లో ఎన్నో సమస్యలు వివరిస్తుంటే.. కేసీఆర్ మాత్రం అసలు తెలంగాణలో సమస్యలే లేవని, ఢిల్లీకి వెళ్లి ఉద్ధరిస్తానని బయలుదేరాడని ఎద్దేవా చేశారు.

నగరానికి కొత్త రూపు తేవాలి

- అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి
- చీఫ్‌విప్, ఎన్‌ఐయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్

వరంగల్ అర్బన్: అభివృద్ధి పనులను పూర్తి చేసి నగరానికి కొత్త రూపు తేవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ఆదేశించారు. గురువారం హనుమకొండ మినీ కలెక్టరేట్‌లో డబుల్ బెడ్ రూమ్, వరంగల్, హనుమకొండ బస్‌స్టేషన్ల నవీకరణ, కాళోజీ కళాక్షేత్రం, స్మార్ట్ సిటీ కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లష్కర్ సింగారంలో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టనున్న రెండ పడకల గదుల పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. వరంగల్ మోడల్ బస్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. హనుమకొండ బస్ స్టేషన్‌ను కూడా నవీకరించేందుకు ఆర్టీసీ అధికారులతో చర్చించి డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచి జూన్ 2 కల్లా పూర్తవ్వాలన్నారు. వడ్డేపల్లి బండ్ సుందరీకరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నిర్దేశ గడువులోగా పూర్తి చేయాలన్నారు సమీక్షలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, బల్దియా కమిషనర్ ప్రావీణ్య, 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్, ఎస్ఈ వాసుచంద్ర, 'కూడా' సీపీఓ అజిత్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్ కుమార్, ఆర్అండ్‌బీ,కూడా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గత అనుభవాలపై దృష్టి సారించండి

- నగర మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: నగరంలో వర్షాలతో కాలనీలు నీటమునిగిన అనుభవనాలను దృష్టిలో పెట్టుకొని ప్రధాన, మధ్య తరహా నాలాల్లో పూడికతీత పనులు యుద్ధప్రతిపాదికన చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్లతో ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రధాన నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వర్షాల సమయంలో సమీప కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వ్యర్థాలను తొలగించాలన్నారు. కాలనీల్లోని డ్రెయినేజీలను పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని కోరారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని భవన సముదాయ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈ రవికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

కేడీసీని మరింత అభివృద్ధి చేసుకోవాలి

● న్యాక్ కమిటీ చైర్మన్ ఎ.సిద్ధిఖీ ● ముగిసిన న్యాక్ కమిటీ సందర్శన

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని న్యాక్ కమిటీ చైర్మన్ జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్ ఇస్లామియా యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ సూచించారు. కేడీసీ న్యాక్ కమిటీ బృందం రెండో రోజు గురువారం ఆకళాశాలలోని విద్యార్థులకు కల్పిస్తున్న భౌతిక వనరులు, కళాశాలలోని సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఆకళాశాల సెమినార్ హాల్‌లో ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా న్యాక్ కమిటీ చైర్మన్ ముస్తాక్ ఎ.సిద్ధిఖీ మాట్లాడుతూ.. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తే బాగుంటుందన్నారు. పూర్వవిద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రెండ్రోజులుగా కేడీసీలో అకాడమిక్‌పరంగా, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించిన అంశాలపై నివేదికను ఆ కమిటీ బృందం చైర్మన్ ముస్తాఖ్ సిద్ధిఖీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డికి అందించారు. ఎగ్జిట్ మీటింగ్‌తో న్యాక్ కమిటీ సందర్శన ముగిసింది. కాగా.. కేడీసీని న్యాక్ కమిటీ సందర్శించిన నేపథ్యంలో గురువారం కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, పాలక మండలి సభ్యులు చంద్రమౌళి న్యాక్ కమిటీతో భేటీ అయ్యారు. ఉన్నత విద్య, వర్సిటీల విద్యపై చర్చించారు. న్యాక్ కమిటీ మెంబర్ కో–ఆరినేటర్ డాక్టర్ మంటన్ కుమార్‌సింగ్, పంజాబ్‌లోని లూథియానా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ ప్రగత్‌సింగ్, ఐక్యూ ఏసీ కో–ఆరినేటర్ బి.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



కురవి వీరభద్రస్వామి ఆలయం



శివరాత్రికి సిద్ధం

నేటి నుంచి ఉత్సవాలు షురూ ● కిటకిటలాడనున్న శైవక్షేత్రాలు ● అన్ని ఏర్పాట్లు పూర్తి

కాళేశ్వరాలయంలో..

కాళేశ్వరం: కాళేశ్వరముక్తీశ్వరాలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు స్వామివార్లను దర్శించుకోనున్నారు. శివరాత్రి సందర్భంగా శివుడు–యముడు కొలువైన క్షేత్రం భక్తులతో కిటకిటలాడనుంది. భక్తులకు ఇబ్బందుల్లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి తీరం వద్ద మహిళలు దుస్తులు మార్చుకేందుకు వీలుగా తాత్కాలికంగా గదులు ఏర్పాటు చేశారు. బ్యాక్‌వాటర్‌తో వరద ఉధృతి ఉండడంతో జల్లు స్నానాలు చేసేందుకు నల్లాలు అమర్చారు. వివిధ రాష్ట్రాల ద్వారా వచ్చే భక్తులు ప్రైవేటు వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను మూడు చోట్ల ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. 12 క్వింటాళ్ల లడ్డూ ప్రసాదం, 8 క్వింటాళ్ల పులిహోర తయారు చేస్తున్నారు.



కాళేశ్వరం గోదావరి తీరం వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు, డ్రెస్సింగ్ రూమ్స్

నేటి నుంచి ప్రత్యేక పూజలు..

17న శుక్రవారం దీపారాధన, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ట రుద్రహవనం, సాయంత్రం ఉత్సవ మూర్తుల ఊరేగింపు, కళాకారులతో సంగీత కార్యక్రమాలుంటాయి. 18న శ్రీముక్తీశ్వర–శుభానందల కల్యాణం, రాత్రి హరికథా కాలక్షేపం కార్యక్రమాలుంటాయి. రాత్రి 12 గంటలకు మహాభిషేకం, లింగోద్భవ పూజలు నిర్వహించనున్నారు. 19న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం పూర్ణాహుతి, నదస్యము, మహాదాశీర్వాదం, పండిత సన్మానం ఉంటుంది. సాయంత్రం శ్రీ ఆదిముక్తీశ్వరస్వామి కల్యాణం జరుపుతారు. రాత్రి 8గంటలకు పవళింపు సేవతో కార్యక్రమాలు ముగుస్తాయి.

వీరన్న ఆలయంలో..



వీరభద్రస్వామి మూల విరాట్

కురవి: ప్రముఖ శైవ క్షేత్రమైన కురవి వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 18న మహా శివరాత్రి సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరపనున్నారు. మార్చి 4 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ముఖ్య ఘట్టాలివే..

శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగనుంది. 18న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం నుంచి 11గంటల వరకు పూర్ణాభిషేకంలో స్వామివారు దర్శనమిస్తారు. రాత్రి 12.43కు ఆదివారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. 19 నుంచి 20 వరకు అభిషేకాలు, బలిహరణ నిర్వహిస్తారు. 21న పెద్ద చెరువులో తెప్పోత్సవం, 23న స్వామివారి రథోత్సవం, 24న పూర్ణాహుతి, బండ్లు తిరుగుట, పారువేట, 25న వసంతోత్సవం, త్రిశూలస్నానం(పెద్దచెరువులో), ఏకాంత సేవ, నాగవెల్లి, 26న స్వామివారి పవళింపు సేవ, మార్చి 3న శివాయలంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి కల్యాణం, 4న 16 రోజుల పండుగతో ఉత్సవాలు ముగుస్తాయి.

మెట్టుగుట్టలో..



పూజలు చేస్తున్న అర్చకులు

మడికొండ: మెట్టుగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమై ఈనెల 24వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో భాగంగా గురువారం సుప్రభాతం, స్వామి వారికి రుద్రాభిషేకం, గణపతిపూజ, సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈఓ భారతి, ఆలయ కమిటీ చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అభిలాశ్, శర్మ, శ్రీ సత్యనారాయణశర్మ, విష్ణువర్ధనాచార్యులు, ధర్మకర్తలు కుమారస్వామి, భూపాల్‌రెడ్డి, బుర్ర సంధ్యారాణి, రాజు, పెద్ది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలు షురూ



సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న ఈఓ నాగేశ్వర్‌రావు, అర్చకులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా శ్రీ భ్రమరాంభిక మల్లిఖార్జున స్వామికి బ్రహ్మోత్సవాలు శైవాగమోక్తంగా అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. గురువారం ఒగ్గు పూజారుల మేలు కొలుపుతో స్వామి మేల్కొనగా అర్చకులు వేద మంత్రాలతో నిత్య పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం ఉత్సవ మూర్తులతో సూర్యప్రభ వాహనసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, భాను ప్రసాద్, నరేశ్ శర్మ, మధు శర్మ, వేద పండిట్ గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మాడ వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయ ఆవరణలో ధ్వజారోహణం చేసి జాతర ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనసేవ విద్యుత్ దీప అలంకారాల మధ్య ఘనంగా నిర్వహించారు.

పాలకుర్తిలో..



గుహలో సోమేశ్వరుడు

పాలకుర్తి టౌన్: పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయం హరిహరులకు నిలయంగా, స్వయంభువులుగా ఒకే గుట్టపై వెలిసిన క్షేత్రంగా వెలుగొందుతుంది. ఇక్కడ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. 18న స్వామి వారి కల్యాణంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ రామచంద్రయ్య శర్మ తెలిపారు.

బ్రహ్మోత్సవాలిలా..

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 17న గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, 18న స్వామి వారి కల్యాణం, 19న రథోత్సవం, బండ్లు తిరుగుట, 20న డోలారోహణం, వసంతోత్సవం, 21న అగ్నిగుండంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలకు సిద్ధమైన కోటగుళ్లు



కాంతులీనుతున్న కోటగుళ్ల ఆలయం

గణపురం: మండల కేంద్రంలోని కాకతీయుల కళా క్షేత్రం కోటగుళ్లు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 18న జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఆలయ ప్రాంగణం ప్రత్యేక దీపాలంకరణతో కాంతులీనుతోంది. ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

వేయి స్తంభాల ఆలయంలో..



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినయ్

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఏర్పాట్లను ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, హనుమకొండ డీసీపీ ఎం.ఏ బారీ, ఏసీపీ కృష్ణ, సీఐ కృష్ణ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. శివరాత్రి సందర్భంగా 5 లక్షల మందికి పైగా భక్తులు రుద్రేశ్వరున్ని దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం పాస్‌లు తీసివేసినట్లు దేవాదాయశాఖ ఫెస్టివల్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. గంగు ఉపేంద్రశర్మ, ఈఓ శేషగిరి మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ అభ్యర్థన మేరకు దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి వద్ద గల శివలింగానికి అభిషేకం చేసుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో పాలుపంచుకునేందుకు భక్తులు చండీహోమానికి రూ. 3,116, స్వామివారి కల్యాణానికి రూ.1,116, అన్నపూజకు రూ. 5,116, లింగోద్భవ కాల పూజకు రూ. 12,116, శివరాత్రి ఉత్సవాల్లో ఐదురోజులు జరిగే పూజల్లో పాల్గొనాలనుకున్న భక్తులు రూ.21,116 చెల్లించవచ్చని తెలిపారు.

కార్యక్రమాలిలా..

17న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం. 18న శ్రీరుద్రేశ్వరస్వామికి సామూహిక రుద్రాభిషేకాలు, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో జరిపే మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం. 19న మహాపూజ, నాగవెల్లి(సదస్యం), 20వతేదీన మహాన్నపూజ, అన్నప్రసాదాల వితరణ, 21న ఉత్సవ ముగింపులో భాగంగా అంజనేయ స్వామికి చందనోత్సవం, ఆకు పూజ, మహాబిల్వార్చన, చండీహోమం పూర్ణాహుతి పండిత సత్కారం ఉంటుంది.

బెదిరించి రూ.21.57 లక్షలు దోపిడీ

ఖమ్మంరూరల్: ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి మీదుగా కారులో వెళ్తున్న వ్యక్తులను బెదిరించిన దుండుగులు భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు దోచుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి చెందిన బి.శ్రీనివాసరెడ్డి హనుమకొండలోని ఓ ప్రైవేట్ చిట్ కంపెనీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు బుధవారం రాత్రి సమయంలో శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌తో పాటు ముదిరెడ్డి సురేందర్‌రెడ్డి, నిమ్మల అన్వేష్, తోట కరుణాకర్ కారులో రూ.21,57,700 నగదుతో ఖమ్మం నుంచి హైదరాబాద్ బయలుదేరారు. వీరి కారు మద్దులపల్లి శివార్లలోకి రాగానే ద్విచక్రవాహనంపై వచ్చి అడ్డగించిన ఇద్దరు వ్యక్తులు గట్టిగా అరవడంతో ఏం జరిగిందోనని కారు ఆపారు. ఈక్రమంలో ప్రమాదం జరిగినట్లు వారు గొడవ చేస్తుండగా కారులో మరో ఆరుగురు అక్కడకు చేరుకున్నారు. ఈక్రమంలో కారులోని శ్రీనివాసరెడ్డి తదితరులపై దాడి చేసి వారి వద్ద ఉన్న రూ.21లక్షలకు పైగా నగదు, నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితులు గురువారం సాయంత్రం ఖమ్మం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా చండికా అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చండికా అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి రుద్రహోమ సహిత శత చండీహోమం, మహా పూర్ణహుతి, మహాకుంభాభిషేకం, భక్తులకు అమ్మవారి మహాదర్శనం ఇచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉష దంపతులు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, డీసీపీ సీతారాం, ఆర్డీఓ కృష్ణవేణి, ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ఈఓ నండూరి రజనీకుమారి, అర్చకులు దేవగిర రామన్న, గౌతం శర్మ, వెంకన్నవర్మ, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దంపతులు, చిత్రంలో సత్యవతి రాథోడ్

జనగామలో క్లోరిన్ గ్యాస్ లీక్!

జనగామ: జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి క్లోరిన్ గ్యాస్ లీక్ కలకలం రేపింది. సిద్దిపేట రోడ్డు కోర్టు ఏరియా సబ్‌జైలుకు ఎదురు నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ సమీపాన కూల్చి వేసిన సంపు వద్ద క్లోరిన్ గ్యాస్ లీకై గాలిలో వేగంగా వ్యాపించింది. దీంతో రోడ్డుపై ఉన్న వందలాది మందితోపాటు ఇళ్లలో ఉన్న వారు సైతం దగ్గు, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు సైతం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గోకుల్‌నగర్, గిర్నిగడ్డతో పాటు చుట్టపక్కల కాలనీలకు చెందిన సుమారు 600 మందికి పైగా ఈ ప్రభావానికి గురయ్యారు. కళ్ల మంటలు, వాంతులు, విరేచనాలతో ఊపిరి ఆడక ఇబ్బంది పడిన 200 మంది వరకు ఆస్పత్రికి పరుగులు పెట్టారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 50 మంది, పట్టణంలోని 8 ప్రైవేటు ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో అడ్మిట్ అయ్యారు. అందరికీ ఆక్సిజన్‌తో కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులతోపాటు ఎస్‌ఐలు భరత్, జీనత్, పోలీసు సిబ్బంది గ్యాస్ లీకైన ప్రాంతానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి పంపించారు. ఓవర్‌ఫ్లో నీటిని స్పీడ్ పెంచడంతో.. సిలిండర్‌లోని క్లోరిన్ అందులో కలిసి ప్రభావం తగ్గింది. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. క్లోరిన్ గ్యాస్ లీకేజీ.. అక్కడ సిలిండర్‌ను ఎందుకు ఉంచారనే దానిపై విచారణకు ఆదేశించారు. క్లోరిన్ గ్యాస్ గాలిలో స్పీడ్‌గా వ్యాపించడంతో గొంతులో మంట, దగ్గు, పలువురికి వాంతులయ్యాయి. ఎటువంటి ప్రమాదం లేదని, జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు పేర్కొన్నారు.

సమృద్ధ భారత్ నిర్మాణమే అమృత కాల బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ్మ

హన్మకొండ: సంపూర్ణ, సంపన్న, సమృద్ధి భారత్ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దేశ అమృత కాల బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. గురువారం రాత్రి హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాణి రుద్రమ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడ్జెట్ అంటేనే ప్రజల సొమ్ము అని దీంతో ఏయే పనులు జరుగుతాయో ప్రజలకు తెలియాల్సిన అవసరముందన్నారు. మన ఇంటి ఖర్చు కోసం ఎలాగైతే ప్లాన్ చేసుకుంటామో.. అదే విధంగా దేశం కోసం కూడా ప్లాన్ చేసేదే ప్రభుత్వ బడ్జెట్ అన్నారు. బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ రాష్ట్ర కో–కన్వీనర్ శ్రీ పులి సరోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు కేతిరెడ్డి విజయలక్ష్మి, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులకు నవజాత శిశువు అప్పగింత

వరంగల్ క్రైం: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గురువారం వదిలివెళ్లిన నవజాత శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ తెలిపారు. ఆంధ్రకు చెందిన పెండ్యాల లక్ష్మీ శిశువును ఆస్పత్రిలోనే ఉంచి వెళ్లిపోయింది. పోలీసులు రైల్వేస్టేషన్‌లో లక్ష్మీని గుర్తించి ఆస్పత్రికి తీసుకొచ్చారు. కాగా.. ఇప్పటికే తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, భర్తకు దూరంగా ఉంటున్నందున పుట్టిన బిడ్డను పోషించలేకనే వదిలి వెళ్లినట్లు ఆమె సమాధానమిచ్చింది. దీంతో శిశువును తల్లి సమక్షంలో ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

ఫైట్‌పై సీపీ సీరియస్

● పోలీసుల అదుపులో ఇంజనీరింగ్ విద్యార్థులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట సమీపంలో బుధవారం రాత్రి ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవపై నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ సీరియస్ అయ్యారు. హాకీ స్టిక్స్, క్రికెట్ బ్యాట్స్, కర్రలను వినియోగించడంపై కొంత ఆగ్రహం వ్యక్తం చేసి గొడవకు గల కారణాలపై ఆరా తీసినట్లు సమాచారం. పూర్తి వివరాలు ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ పోలీసులను ఆదేశించడంతో ఘర్షణ జరిగిన ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను సేకరించినట్లు తెలిసింది. వీటి ఆధారంగా పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘర్షణలో ఓ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం హాస్టల్ విద్యార్థులు ఉన్నట్లు తెలిసింది. అమ్మాయి వ్యవహారంలో ఓ కళాశాలకు చెందిన విద్యార్థులు మరో కళాశాల విద్యార్థితో ఘర్షణ పడడంతో ఇదంతా జరిగినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి వదలి పెడతారా? వారిపై కేసులు నమోదు చేస్తారా అనేది ప్రశ్నగా మారింది. కేసులు నమోదు చేస్తే వారి భవిష్యత్ నాశనమవుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.